ఎవరిదో బూట్ల శబ్దం తన సీటు దగ్గరగా ఆగినట్లనిపించి తలెత్తి చూసింది శిరీష.

# "డిటో"

హేమమాలిని



టైపు రైటర్ కీ బోర్డు మీద కదులుతున్న ఆమె చేతి వ్రేళ్ళు హఠాత్తుగా ఆగిపోయాయి. ఎదురుగా నిల్చుని తనవైపే చూస్తూ "క్షమించండి, మీరు శిరీష కదూ" అంటున్న యువకుడ్ని చూసి తనలో కలిగిన ఏదో కొత్త ఫీలింగ్‌ని కప్పిపుచ్చే ప్రయత్నంలో కళ్ళు క్రిందకు దించి 'అవును' అన్నట్లుగా తలూపింది.

"నా పేరు శ్రీరామ్" అన్నాడతను తనని తనే పరిచయం చేసుకొంటూ.

శిరీషకు వెంటనే గుర్తుకు వచ్చింది. రెండు రోజుల క్రితం అమ్మ చెప్పిన మాటలు 'నిన్ను చూడ్డానికి మీ ఆఫీస్‌కు శ్రీరామ్ అన్నతను వస్తాడని'. అయితే ఇతనేనన్న మాట.... గుండె ఝల్లుమంచి శిరీషకు.

శ్రీరామ్ కూర్చున్న తరువాత కొన్ని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి. ఎందుకు కలిశారో, జరగబోయే సంభాషణ ఏమిటో ఇద్దరికీ తెలుసు. అయితే ఎలా ప్రారంభించాలో మాత్రం ఇద్దరిలో ఎవరికీ తోచడం లేదు.

శ్రీరామ్ ఎలాగో సంభాషణ ప్రారంభించి, తన ఉద్యోగం గురించి, రాబోయే ప్రమోషన్ల గురించి చెప్తున్నప్పుడు, ఇట్టే ఆకర్షించే చురుకైన అతని కళ్ళ వైపు చూస్తూ అతని మాటలకు ఊఁ కొడుతూ ఉండిపోయింది శిరీష.

అతను అసలు విషయానికి వస్తున్నట్లు సీరియస్‌గా ముఖం పెట్టి అతి మర్యాదగా- "నే నెందుకు వచ్చానో మీకు తెల్సు. నా అభిప్రాయం మీకు ఒక స్లిప్ మీద వ్రాసిస్తాను. అలాగే మీరు మీ అభిప్రాయం వ్రాసివ్వండి" అన్నాడు.

'సరే' నన్నట్లుగా తల ఊపింది శిరీష.

అక్కడున్న ఒక కాగితం తీసి గబగబా ఏదో వ్రాసి మడతపెట్టి ఆమెకిస్తూ, "ఒక్క షరతు, దీనిని మీరు నేను వెళ్ళిన తరువాత మాత్రమే చూడాలి" అన్నాడు నవ్వుతూ.

"మీరూ అంతే" అంటూ తను వ్రాసిన కాగితం ఇచ్చింది శిరీష.

శ్రీరామ్ వెళ్ళగానే అదురుతున్న గుండెలతో ఆ కాగితం విప్పిన శిరీష. 'సారీ! మీరెందుకో నాకు నచ్చ లేదు' అని వ్రాసి ఉండటం చూసి పేలవంగా నిట్టూర్చింది.

హుషారుగా గేటు దాటిన శ్రీరామ్ శిరీష ఇచ్చిన సిప్ తెరిచాడు. దాంట్లో సింపుల్‌గా 'డిటో' అని వ్రాసి ఉండటం చూసి నివ్వెరపోయాడు. ●







బెంగాలీ కవిత :

## 'అనరా వీర'

అనరా వీర
అను, అను....అను.
నిటారు నీ శిరమని, అవ
నతము హిమవత్ శిఖరమని
అను
అను.

* * *

నీ నరనరాన రణక్లాంతి
లేదు నీకు మనశ్శాంతి
అవనిపై, ఆకశంలో
అసహాయుల ఆక్రందన
నిస్సహాయుల ఉత్పీడన
ప్రతిధ్వనించునంత దాకా
లేదు నీకు విశ్రాంతి అని-
అనరా వీర
అను, అను.
అత్యాచారం ఎత్తిన ఖడ్గం
అన్యాయం చేతి దుర్మార్గపు కృపాణం
యుద్ధభూమి, రుద్రభూమి
ఆగునంతదాకా
లేదు నీకు విశ్రాంతి
లేదు నీకు మనశ్శాంతి అని-
అనరా వీర
అను, అను.

—శ్రీ కాజీనజ్రుల్ ఇస్లాం
తెలుగు : నిర్మలానంద